**"క్లిక్...క్లిక్...క్లిక్" చదివి పుస్తకం పక్కన పడేసింది సుజాత. ఆమె కళ్ళ ముందు యమునే కదులుతున్నాది. ఆ యమునలా ఆ సాహసం. 'నిజం' పరిశోధించడంలో సమయస్ఫూర్తి, నేర్పు ఎంతమంది ఆడపిల్లలకి వుంది?**

# వారధి

## న్యాయపతి కమలారాంజీ

ఎవరిదాకానో ఎందుకు? తను.... తను మాత్రం ఏం చేయగల్గుతోంది? భర్త చెప్పిన మాటల్ని నమ్మడం తప్పు. నిజమేమిటో పరిశోధించి తెల్సుకుందికి ప్రయత్నించిందా ఏనాడైనా?

భారంగా నిట్టూర్చింది సుజాత.

పెద్ద లైటు ఆర్పేసి బెడ్ లైటు వేసి పరుపుమీద వాలింది. కళ్ళు మూతలు పడ్డా మనసు మూతపడలేదు. ఆలోచనలు కందిరీగల్లా మనసు చుట్టూ తిరుగుతూనే వున్నాయి.

* * *

తను అట్టే అందంగా వుండదు. నల్లగా. సన్నగా వుంటుంది. కాని అదృష్టం కొద్దీ తనకి జయరాం లాంటి అందమైన భర్త దొరకేడు. అసలు జయరాం పర్సనాలిటీ. ఆ హుందాతనం. కొంటెచూపు. బొద్దు మీసాలు. మోటు పెదవులు. విశాలమైన ఛాతీ...ఏ డ్రస్సు వేసుకున్నా ఇట్టే అమరుతుంది! తను నవ్వుతూ. అందర్నీ నవ్వించే స్వభావం అతనిది. ఎంతమందిలో వున్నా ఒక ప్రత్యేకత వుంటుంది. రోడ్డుమీద వెళ్తుంటె ఆడపిల్లలు ఒకటికి రెండుసార్లు ఆయనవైపే చూస్తారు! అలాటి అందం ఆయనది! అందానికి జతగా చిలిపితనం. కొంటెతనం కూడా కల్సేయి. ఆయనంటే ఒక డివైన్ వర్షిప్ సుజాతకి. కళ్ళప్పగించి అలా చూస్తూండిపోతుంది ఎంతసేపైనా.

"ఏమిటోయ్ అలా చూస్తున్నావు. దిష్టి పెట్టేస్తావా?"

"పొండి మీకు నేను దిష్టిపెట్టేస్తే నాకే నష్టం!"

"ఓహ్ అదా అమ్మగారి బాధ! చూసుకో. ఎంతసేపైనా చూసుకో, నాకు దిష్టి గిష్టిల్లాంటివి తగలవు."

"అది సరేగాని. తమరు యింత ఛక్ ఛక్ లాడిపోతూంటారుకదా. మరి తమరి పెళ్ళి... అదే మన పెళ్ళి కాక ముందు....ఎవరైనా మిమ్మల్ని ప్రేమించడం లాంటివి జరగలేదా? ఏ అమ్మాయి మీ మీద పడిపోయి "నువ్వు పెళ్ళి చేసుకోకపోతే నేను తక్షణం ప్రాణాలు వదిలేస్తాను" అన్లేదా? ఏవండీ. నిజంగా 'నిజం' చెప్పండి ప్లీజ్."

"సుజా! ఏం నీకేమైనా వేళాకోళంగా వుందా? మనకలాంటి ప్రేమలు-దోమలు పడవు. బుద్ధిగా పెద్దవాళ్ళు చెప్పినట్టు నడుచుకోవడం వాళ్ళు ఏ అమ్మాయిని చేసుకోమంటే ఆ అమ్మాయిని చేసుకోవడం. హాయిగా పెళ్ళాంతో...."

కొంటెగా చూస్తుంటే సుజాత కళ్ళు సిగ్గుతో కిందికి వాలిపోయేయి.

"అది కాదండీ. పెళ్ళి కాకముందు మీకు ఎలాంటి కోరికలు కలగలేదా? ఏ అమ్మాయినైనా చూసి మనసు చలించడం లాంటివి జరగలేదా? అసలు మీకు 'ప్రేమ' అన్నది అనుభవంలోకి రాలేదా? చెప్పండీ. తమరు మతిమరుపు మహాశయులని తెల్సుకాని ఏదో కాస్త జ్ఞాపకం చేసుకుని చెప్పండి ఇలాంటి నవమన్మధుడ్ని ప్రేమించకుండా ఏ అమ్మాయి వదిలేస్తుంది! నాకు నమ్మకం చాలడంలేదు" అతని ఛాతీమీద దట్టమైన వెంట్రుకల్ని చేత్తో రాస్తూ దగ్గరగా జరిగి అంది సుజాత.

ఒక్క నిముషం పాటు కళ్ళు మూసుకున్నాడు జయరాం.

"అవును. నువ్వు 'ప్రేమ' అంటే నాకో విషయం జ్ఞాపకం వస్తుందోయ్!" అతని పెదవులమీద చిన్న చిరునవ్వు మెదిలింది. కళ్ళల్లో మెరుపు!



అతనల్లా చూస్తుంటే సుజాతలో ఏదో అనుమానంతో పాటు చెప్పలేనంత ఆతృత కూడా కలిగింది. అదేమిటో వినెయ్యాలనే తొందరపాటు ఆమెలో అధికం కాసాగింది.

"అదేనోయ్. నా స్నేహితుడి ప్రేమ వ్యవహారం.... వాడిదొక తమాషా అయిన ప్రేమవ్యవహారం అనుకో."

"ఏమిటండీ అది?"

జయరాం చెప్పడం మొదలెట్టేడు—

"నా స్నేహితుడు సారథి నీకు బాగా తెలుసు కదా వాడూ, నేనూ కాలేజీలో చదివే రోజుల్లో మా క్లాసులో ఒకమ్మాయి వుండేది. తెల్లగా, బొద్దుగా ముద్దబంతిపువ్వులా వుండేది. ఆ అమ్మాయి పేరు రేవతి. రోజూ చక్కటి పరికిణీలు, పువ్వుల పరికిణీలు, మంచి మంచి వోణీలు వేసుకొచ్చేది. సీతాకోక చిలకలా వున్న ఆ అమ్మాయి వెనకే అబ్బాయిలందరూ పడేవారు. ఎలాగయిందో ఆ అమ్మాయికీ మనవాడికీ స్నేహం! ఇద్దరి



మధ్యా ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచేవి...."

ఊపిరి బిగపట్టి వింటున్నది సుజాత.

ఒకసారి ఆమె కళ్ళలోకి చూసి మళ్ళీ మొదలెట్టేడు—

"సారథి వుత్త పిరికి వెధవ. వాడికి ప్రేమించటానికి కూడా భయమే. ఆ అమ్మాయంటే పడి ఛస్తాడు. కాని వాళ్ళ నాన్న

గారంటే భయం. రేవతి సారథికి వుత్తరాలు స్వయంగా చేతికిస్తే ఎవరైనా చూసేసి వాళ్ళ నాన్నగారికి చెప్పేస్తే వాడి వీపు చిట్లిపోతుందని విపరీతంగా భయపడిపోయే వాడు. అందుకే వాళ్ళిద్దరూ నన్ను వారధిగా ఎంచుకున్నారు...."

"వారధా? అదేమిటి!"

"ఉండు - చెప్తాను. రేవతి సారథికి వుత్తరం రాసి నా చేతికిచ్చేది. దానికి జవాబు సారథిరాసి తిరిగి నా చేతికిచ్చేవాడు. వాడి వుత్తరం ఆ అమ్మాయికి ఆ అమ్మాయి వుత్తరం వీడికి అందించడం అన్నమాట. అలా సాగేది వాళ్ళిద్దరిమధ్య ప్రేమ వ్యవహారం... "

"అయితే వాళ్ళిద్దరికీ పెళ్ళయిందా? సారథి పెళ్ళాం పేరు రేవతి కాదనుకుంటాను." ఏదో ఆలోచిస్తూ అంది సుజాత.

"తొందరపడకోయ్. పూర్తిగా చెప్పనీ. నాకు రేవతి వాళ్ళయింట్లో వాళ్ళంతా బాగా తెల్సు. వాళ్ళూ, మేమూ ఫేమిలీ ఫ్రెండ్స్. అంచేత నేను వాళ్ళింటికి వెళ్ళేవాడ్ని. ఒక్కడ్నే కాదు సారథిని వెంటబెట్టుకుని. డాబా మీదకు చేరుకోగానే నన్నొదిలేసి సారథి, రేవతి కబుర్లలో పడిపోయేవారు. వాళ్ళనలా కొంతసేపు కబుర్లు చెప్పుకోనిచ్చి చిన్నగా దగ్గేవాడ్ని. 'ఇహ పదరా నాయనా. వాళ్ళ నాన్నగారు వచ్చేరంటే బాగుండదు' అన్నట్టుగా.

"వాడు పాపం లేచి వచ్చేసేవాడు. ఇలా మరి కొన్నాళ్ళు సాగింది. తర్వాత ఎలా తెల్సిపోయిందో రేవతి వాళ్ళ నాన్నగారిక్కీ ఈ విషయం తెల్సిపోయింది. అగ్గిమీద గుగ్గిలంలా మండిపడి ఆ వూర్నించి ట్రాన్స్ఫర్ చేయించేసుకున్నారు. రేపు వాళ్ళా వూర్నించి వెళ్ళిపోతారనగా ముందు రోజు రాత్రి నేను, వాడూ కల్సి రేవతిని

## తల్లి

ఆమె తల్లి
అతడు బిడ్డ
చిన్నప్పుడు
ఏడిపించాడామెని
అన్నం తిననని
ఇప్పుడు
ఏడిపిస్తున్నాడామెని
అన్నం పెట్టనని!

—కాశీనాథ అండ్ కాశీనాథ

చూద్దామని వాళ్ళ పెరటి వైపు నుంచి వాళ్ళింట్లోకివెళ్ళాం. ఆచీకట్లో రేవతి పెరట్లోకి వస్తుందేమోనని చాలాసేపు చూసేం. కాళ్ళకి గండు చీమలు కుట్టేస్తున్నా లక్ష్యపెట్టకుండా బాధకోర్చుకుంటూ అలాగే నించున్నాం. ఇంతలో వాళ్ళఆఖరి తమ్ముడు పెరట్లోకి వస్తూ కనిపించేడు. వాడ్ని మెల్లిగా పిల్చి కాస్త మంచి మాటలు చెప్పి వాళ్ళక్కని ఎలాగైనాపిల్చుకురమ్మన్నాం. వాడు అలాగే చేసేడు. రేవతి ఏడుస్తోంది కాబోలు. కళ్ళుపుబ్బివున్నాయి. మమ్మల్ని చూసి గతుక్కుమంది.

"నిన్ను చూడకుండా వుండలేను. ఎలాగ రేవతీ?" అన్నాడు సారథి.

రేవతికూడా అదే అంది. వాళ్ళిద్దరూ ఏడుస్తుంటె నా కళ్ళంటకూడా నీళ్ళొచ్చేయి తుడుచుకున్నాను.

"మా నాన్న వీధి గదిలో వున్నారు. ఏ క్షణంలోనైనా పెరటివైపు రావచ్చు. చూస్తే పెద్ద గందరగోళం అవుతుంది. మీరిద్దరూ వెళ్ళిపోండి." అంది నీళ్ళు నిండిన కళ్ళతో.

మేమిద్దరం బరువెక్కిన హృదయాలతో ఎలాగో బయటపడ్డాం."

సుజాతకి మనసు నెవరో పిండేస్తున్నట్టు అనిపించసాగింది. 'రేవతి ఎంత అదృష్టవంతురాలు! తన కోసం యింత మంది మగాళ్ళిల్లా తపించిపోతున్నారనే భావన ఆడదానికి ఎంత హాయి నిస్తుంది! తన కలాంటి అనుభూతి.... ఒక్కటి... ఒక్కటి కూడాలేదే!..' మనసు బాధగా మూలిగింది. చేదుమాత్రలు మింగుతున్నట్టు ముఖం పెట్టింది.


"నువ్వేమిటి అలా అయిపోయేవు? నీకూ బాధగానే వుందికదూ. రేవతి అందం అలాంటిది! అస్సలు అంత అందమైన అమ్మాయిని వదిలిపెట్టి వెళ్ళాలంటే ఏ మగాడికి మనసొప్పుతుంది?!

"ధైర్యంగా లేచిపోదాం" అన్నాడు సారథి గొంతు పెగుల్చుకుని. కాని అది వాడి నాలుక చివరనుంచి వచ్చిన మాటేగాని గుండె లోతుల్లోంచి వచ్చిన మాట కాదు అది. ఎందుకంటె వాడ్ని అలా చెప్పమన్నది నేనే కనుక. అస్సలు వాడికలాంటి లేచిపోవడాలంటే విపరీతమైన భయం. లోకం దృష్టిలో, సమాజం దృష్టిలో నేరస్తుడిగా చూడబడడం వాడికిష్టం లేదు. రేవతీ అంతే. వరుమ్మాప్రతిష్టఅంటూ కూర్చుంది. ఇహ వాళ్ళిద్దర్నీ కలపడం బ్రహ్మతరం కాదు. వాళ్ళు ఆ వూర్నించి వెళ్ళిపోయేరు. కాని సారథి రేవతిని చూడకుండా ఉండలేకపోయేవాడు. అన్నం తినడం మానేసి. గడ్డం పెంచేసి తాగుడులేని దేవదాసులా తయారయ్యేడు! పిరికివాడు ప్రేమకి అనర్హుడు. వాడికి ప్రేమేమిటి నా మొహం! ఇటు వాళ్ళ తండ్రితో చెప్పుకోలేడు. అటు రేవతి తండ్రిని ధైర్యంగా అడగలేడు. అలాంటి పిరికి వెధవని ప్రేమించడం రేవతి తెలివితక్కువతనం. ఉన్నట్టుండి ఒక రోజు సారథి అన్నాడు.

'జయరాం మనిద్దరం వాళ్ళవూరు వెళ్ళి ఒక్కసారి రేవతిని చూసొద్దాం రా' అని.

నాకు గుండెలో రాయిపడింది. వున్న వూళ్ళో కల్సుకుందికే బ్రహ్మప్రళయంఅయిపోయేది. ఇహ పైవూరువెళ్ళి వాళ్ళయిల్లెక్కడుందో కనుక్కునివెళ్ళడంఅంటేమాటలా! అదికాక మా యింట్లో వాళ్ళద్వారా రేవతికి పెళ్ళనిశ్చయమైనట్టు తెల్సింది. కాని ఆ సంగతి వాడికి చెప్తే బెంగపెట్టుకుని జ్వరం తెచ్చుకుంటాడేమోననిపించింది.

పైకి ఏమీ మాట్లాడకపోయేసరిక్కి. వాడు మరింత బలవంతంచేసేడు వెళ్దాం రమ్మని. ఆఖరికి యిద్దరం బయల్దేరేం. వాళ్ళ యింటికి



పీధి కాంపౌండ్. గేటువుండి రెండువైపులా కొబ్బరిచెట్లుంటాయని విన్నాను. ఆ ఆనవాలు పట్టుకుని యిద్దరం వెళ్ళేం. ఎలాగో రేవతిని చూసేం. తిరిగి రేవతి ఏడుపు! వాళ్ళిద్దరికీ ఏడుపు తప్పమరేమీ చేతకాదేమోననిపించింది.

అలాంటప్పుడు అసలు వెళ్ళడం ఎందుకు? వీడికి బుద్ధిలేకపోతేసరి అనుకున్నానువిసుగ్గా అక్కడ్నుంచి వచ్చేశాం. తర్వాత రేవతికి పెళ్ళయిపోయింది!"

* * *

సుజాతకు ఎక్కడలేని నీరసం వచ్చేసింది. మనసులో శతకోటి భయాలు, అనంతకోటి సందేహాలు భయం. బాధ ఆమె మనసుని కుమ్మరిపురుగుల్లా దొలిచేస్తున్నాయి.

"అసలింతకీ ఆ రేవతిని ప్రేమించింది సారథా లేక మీరేనా?"

ఆశ్చర్యంగా చూసేడు జయరాం. సుజాత నీళ్ళు నిండిన కళ్ళకి జయరాం అస్పష్టంగా అగుపించేడు.

"అరె. సుజా! నీకు పిచ్చిపట్టినట్టుంది. నాకూ రేవతికీ మధ్య ఏమీలేదు. సారథి నిజంగానే ప్రేమించేడు. రేవతి కూడా సారథినే ప్రేమించింది. నేను కేవలం నిమిత్తమాత్రుడ్ని. వాళ్ళిద్దరి మధ్య వారథిని. నన్ను నమ్మకపోతే నేనేం చేసేది? ఆఁ అన్నట్టు ఒక పని చేస్తే సరి. సారథి ఈసారి ఇక్కడికి వస్తే నీ ఎదురుగానే వాడ్ని అడిగేస్తాను. అప్పుడు 'నిజం' నీకు తెల్సిపోతుంది. సరేనా. ఏదీ ఇప్పుడు అమ్మాయిగారు నవ్వాలి. ఏదీ నవ్వు! నవ్వు మరి. "నవ్వాలి" .... అతని బలమైన చేతుల్తో ఆమెని దగ్గరగా హత్తుకుంటూ ప్రేమగా ఆమె జుత్తులోకి వేళ్ళు పోనిచ్చి అన్నాడు.

ఆమె మనసు కొంచెం తేలికపడింది. నిజమే అయివుంటుంది. తను అనవసరంగా లేనిపోనివి వూహించుకుంటోంది కాబోలు. కాని మనసు లోపలిపొరల్లో ఎక్కడో చిన్నగా గుచ్చుకుంటున్న భావన!

"అన్నట్టు సుజా! రేవతి ఈ పక్కవూళ్ళోనే వుంది. మొన్నెప్పుడో నేనలా వెళ్ళిపోతూంటే కనిపించింది. రేవతి చిన్నసైజు రోడ్డురోలరులా వుంది-పక్కన ఆమె భర్త కాబోలు సన్నగా ఈగు పుల్లలా వున్నాడు. ఈ అయిదారేళ్ళల్లో ఆమెలో ఎంత మార్పు! జుత్తు పల్చబడిపోయింది. చిన్న ముడివేసుకుంది. మునుపటి అందమే లేదు."

"ఏ వూరు?"

ఆ వూరి పేరు చెప్పేడు జయరాం.

"మీరు మాట్లాడ లేదా?"


"లేదు."

* * *

అక్కడికి ఆ విషయం వదిలేసింది సుజాత. కాని అనుమానం పెనుభూతం అన్నట్టుగా సుజాత మనసులో అనుమాన బీజం నాటుకుంది. అది రోజు రోజుకీ మహావృక్షమైపోతోంది.....తను సారథిని చూసింది. అట్టే బాగుండడు. తన భర్తంత అందమైన వాణ్ని వదిలేసి సారథిని ప్రేమిస్తుందా రేవతి? ఆ మాటల్లో ఎంత నిజముంది? తను పదేపదే 'ప్రేమ' గురించి అడిగితే అతను తన గురించి చెప్పుకోడం ఇష్టంలేక సారథి పేరు చెప్పేసి వుంటారు. అసలు సారథి ఎవ్వరితో మాట్లాడకుండా ముభావంగా వుంటాడు. ఒకమ్మాయి-అందులోనూ రేవతి లాంటి అందమైన అమ్మాయి సారధి లాంటి ముద్దపప్పుని ప్రేమించిందంటే తనెందుకో నమ్మలేకపోతోంది. ఆ అమ్మాయి జయరాంని ప్రేమించి వుంటుంది. అందుకే జయరాం చేతికి ప్రేమలేఖలు అందించింది. ఇంకెవరినో ప్రేమిస్తూ జయరాం చేతికి ప్రేమలేఖ యిస్తే అది అతను చదివేస్తాడేమోననే అనుమానం రాదా ఆమెకి? నిజంగా రేవతి ప్రియుడు జయరామే. అందుకే ఆయన వాళ్ళింటికెళ్ళి డాబామీద గంటల తరబడి వుండేవారు. మధ్యలో సారథి పేరు చెప్తున్నారు తన సౌకర్యం కోసం. ఆమెని ప్రేమించేరు కాబట్టే పనికట్టుకుని ఆమె ఏ వూర్లో వుంటే ఆ వూరికి అష్ట-కష్టాలుపడి వెళ్ళేరు!

'తను మోసపోయింది. ఘోరంగా మోసపోయింది. ఇప్పుడేం దారి? భగవాన్! అతని హృదయంలో స్థానం ఇదివరకే ఒకమ్మాయికిచ్చేసేరు. మరి తనకి ఆ హృదయంలో స్థానం లేదు. ఏదో పెద్దవాళ్ళు పెళ్ళి చేసేరు కదాని కల్సి బ్రతకడం తప్పితే అనురాగం కరువైపోయిన తన బ్రతుకూ ఒక బ్రతుకేనా!! ఆ రేవతి అందంగా వుంటుందని. ఒకటికి పదిసార్లు వల్లించేరు. ఎంత యిష్టం లేకపోతే అన్నిసార్లు ఆమె అందాన్ని పొగుడుతారు. భార్య ముందు మరొక స్త్రీ అందాన్ని పొగిడితే ఆమె మనోభావాలెలా వుంటాయని ఆలోచించరేం ఈ మగాళ్ళు! మనస్సుని రంపంతో కోస్తున్నట్టు వుంటుంది భరించలేని బాధ మనస్సంతా వ్యాపిస్తుంది. ఆ బాధని అర్థం చేసుకోలేని వాళ్ళు దాన్ని ముచ్చటగా "ఈర్ష్య" అనేస్తారు! కాని అనుభవంలోకి వస్తే గాని తెలియదువాళ్ళకి!

'జయరాం మనసు ఆ అమ్మాయి దోచేసింది. ఇహ తనకేం మిగల్లేదు. అయ్యో ఎంతపనైపోయింది. అతను ఎంతో ప్రేమగా చూసుకుంటున్నారు తనని. అయితే అదంతా నటనా! అయివుండొచ్చు. ఏముంది? ఎలాగా పెళ్ళయిపోయింది. ఇప్పుడింకా రేవతినే తల్చుకుంటూ కూర్చుంటే ఎలా కుదురుతుంది? ఎంతైనా ఇది నా భార్యే కదా అని అభిమానంగా చూడ్డానికి నిర్ణయించుకొని వుంటారు! అంతేరేపెప్పుడో సారథి వస్తే తన ఎదుటే అడిగేసానన్నారు. కాని అదెలా సాధ్యం అవుతుంది? ఎంతటి కాలకూట విషాన్నైనా తనలోనే యిముడ్చుకుని పైకి నవ్వుతూ సుఖం పెట్టేఆడవాళ్ళున్న దేశంలో పుట్టింది తను! భర్తమీద అనుమానం వుందని పైవాళ్ళకి



తెలిస్తే ఇక తన పనువేం మిగుల్తుంది? తనకి అతనిమీద అనుమానం వుందని మూడో కంటివాడికి తెలియకూడదు. కాని అనుమాన నివృత్తి చేసుకోవాలి ఎలాగ? ఎలాగ? ఎలాగ? ఆమె కేమీ పాలుపోవడం లేదు.

ఈ మధ్య రోజూ యిదే విషయం గురించి పగలూ- రాత్రీ ఆలోచిస్తోంది సుజాత. జయరాంతో కల్సి సినిమాలకు వెళ్తున్నాది. ఫ్రెండ్స్ యిళ్ళకు వెళ్తున్నాది. అతనితో పైకి సంతోషంగానే మసలు కుంటున్నాది. కాని లో లోపల ఈ అను మాన దావానలం ఆమె మనసుని కాల్చుకు తినేస్తున్నాది. అలాంటి సమయంలోనే "క్లిక్.... క్లిక్.... క్లిక్...." ప్రారంభ మయింది. అది చదువుతూవుంటే అనుకుంది- 'తనుకూడా యమునలాగ సాహసం చెయ్యా లని ఎవ్వరికీ ఎటువంటి అనుమానం రాకుండా ముందు తన అనుమానం తీర్చుకో వాలి! అప్పటివరకా తనకి మనశ్శాంతి లేదు!'

ఆలోచించింది. తీవ్రంగా ఆలోచిం చింది. ఒక చక్కటి ఆలోచన.... ఫ్లాష్‌లా వెలిగింది ఆమె బుర్రలో. ఒక నిశ్చయాని కొచ్చిన దాన్లా లేచింది. జయరాం వూళ్లో లేడు. ఏదో కేంప్ కని పైవూరు కెళ్ళాడు. రెండు రోజులదాకా రాడు. ఇదే మంచి అవ కాశం. త్వరపడాలి. తప్పదు. గబగబా వంట పూర్తిచేసేసి ఏదో యింత తిన్నానని పించి వంటిల్లు సర్దేసింది. పెరటి తలుపు గడియ వేసింది. ప్యూర్ సిల్క్ చీర. దానికి మేచింగ్ బ్లౌజ్ వేసుకుంది. కుడిచేతికినాలుగు బంగారు గాజులున్నాయి. ఎడంచేతికి రిస్టు వాచీ కీ యిచ్చి పెట్టుకుంది. అద్దంముందు నుంచుని చూసుకుంది. ఫర్వాలేదనిపిం చింది. ఒక్క నలుపు తప్ప తనకేం లోటు! ఈ మధ్య పెళ్ళయ్యాక కాస్త వళ్ళుచేసి నట్టుంది. బుగ్గల్లోకి నిగారింపు వచ్చింది. హేండ్ బేగ్‌లో వంద రూపాయల నోటు కుక్కి, జోళ్ళు వేసుకుని వీధితలుపు తాళం వేసి, తాళంచెవి హేండ్ బేగ్‌లో పెట్టుకొని గబగబా మెట్లు దిగింది. ఇటూ - అటూ చూసింది. జయరాం వచ్చేస్తే తను అను కున్న పని సాధించలేనేమోనని దిగులు ఒక వైపు. తను బస్సు ఎక్కుతున్నప్పుడు ఎవరైనా తెల్సినవాళ్ళు చూసేసి జయరాంకి చెప్పేస్తే తన పనువేమయిపోతుందో ననే భయం మరో వైపు ఆమెని వేధిస్తున్నాయి. అయినా "యమున" ఒకసారి కళ్ళ ముందు కదలగానే ఎక్కడ లేని ధైర్యం తెచ్చుకుని రిక్షాని పిల్చి అందులో కూర్చుంది....

[ఈ కథకు సరియైన ముగింపు మీరే వూహించి పంపండి. అక్టోబరు 10 వ తేదీలోగా మాకు చేరిన రచన లలో ఉత్తమమైనవిగా నిర్ణయించిన మూడింటికి వరుసగా రూ. 50 రూ. 30, రూ. 15 బహుమతులుగా అందజేస్తాము. —ఎడిటర్

## నైజం

భగవద్గీత
మొదటి పేజీని
కోర్టు బోనులో
చింపేసిన నిర్దోషిని
చట్టం
నిర్దాక్షిణ్యంగా ఉరితీసింది
చివరి దాకా కొరికేసిన
చిట్టెలకని మాత్రం
ఇంకా బోనులో
పట్టలేకుండా వుంది.

—టి. వేణుగోపాల్


విద్యుచ్ఛక్తి సరఫరాకు తగిన సాధనము
ఏవన్‌ప్లాస్ట్®

రిజిడ్ పి.వి.సి.
కాండ్యూట్ పైపులు.
16 మి.మి నుండి
63 మి.మి. వరకు లభిస్తాయ.



MAP/A1/4484 TEL

IS : 2509

ఏ వన్ ఇండస్ట్రీస్
ఇ7/1 యూనిటి బిల్డింగ్స్ బెంగళూరు 560002 ఫోన్: 225283/224801